# పిచ్చిమాలోకం

ముప్పైయ్యైదు వసంతాల్ని ముచ్చటగా దాటేసిన మురహరికి ఆఫీసులో పగలు డ్యూటీ కంటే రాత్రి డ్యూటీయే మేలనిపిస్తుంది. రోజంతా వందలాది మంది ఉద్యోగులతో కిటకిటలాడే సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీసు - రాత్రికి - దోపిడీకి గురైన పోలీసుస్టేషన్లా చల్లబడిపోతుంది. అతన్లాంటి టెలిగ్రాఫిస్టులు పదులమీదే ఉంటారు డ్యూటీలో.

అంతేకాదు... అతని గుండెల్లో అగ్నులు రగిల్చే ఆడ ఉద్యోగులసలే కనిపించరప్పుడు.

మురారి చేతిలో ఎక్స్‌ప్రెస్ టెలిగ్రామైనా మన్నుదిన్న పాములా నత్తనడక నడుస్తుందనీ... ముప్పయి టెలిగ్రాంలు వెళ్ళే సమయంలో మూడు గూడా వెళ్ళవనీ..అతని దృష్టిలో టెలిగ్రాం కసలు విలువే పోయిందని అంటారు.

అందుకే డిపార్టుమెంటతన్ని ఇంతవరకెవ్వరికీ ఇవ్వలేనన్ని సంఖ్యలో మెమోలు, సంజాయిషీ నోటీసులిచ్చి సత్కరించిందంటారు. నిజానికీ విషయంలో గిన్నీస్ బుక్కాఫ్ వరల్డ్ రికార్డ్స్ కెక్కాల్సిన అర్హత ఉందతనికి.

"ఇదేమయ్యా! ముందు బాగా పని చేసేవాడివి. రాను రాను రాజు గుర్రం గాడిదవుతుందేమిటీ?" అడిగాడు టెలిగ్రాఫ్ మాస్టరోసారి.

"టెలిగ్రాముల్ని నేనేమన్నా తింటున్నానా సార్! కొన్ని గంటలటు ఇటుగా పంపిస్తున్నాను గదా!" అనేశాడు ఏటో చూస్తూ ఆవేశంగా.

కానీ... డెత్ మెసేజ్ తగిల్తే మాత్రం అర నిమిషమైనా ... ఆలస్యం చేయకుండా ఆఘమేఘాల మీద పంపించేస్తాడు. డెత్ మెసేజ్ ఏ వూరి కెళ్ళాలో ఆ సర్క్యూట్‌కి వెళ్ళి సవ్యంగా కొట్టేసి గుండెల నిండా ఊపిరి పీల్చుకుంటాడు.

ఆఫీసుకు రాగానే మరో లోకం చేతులు చాచి పిలుస్తుందతన్ని.

అప్సరసల్ని తలదన్నే అనిత చంద్రకాంత మణుల్లా మిలమిలా మెరిసే కళ్ళతో స్వాగతం చెబుతుంది. అతని కెదురుగా కూర్చుండి కళ్ళలోకి చూస్తుంది. కోటేరు లాంటి నాసికను కాపలా కాస్తున్న చారడేసి కళ్ళను గమ్మత్తుగా తిప్పుతూ స్వచ్ఛంగా నవ్వేస్తుంది. ఆ నవ్వుకతని హృదయపుష్పం శతసహస్ర దళాలను విప్పేస్తుంది. ఎదపాదలోంచి పొంగు కొచ్చే భావతరంగాల కంతుండదు.

టెలి ప్రింటర్ల టకటకలూ, మోర్సులైన కిటకిటలూ ఫుల్‌స్వింగ్‌లో శబ్దించేస్తూ అతన్నీ లోకంలో పడేస్తుంటాయి. అప్పుడే కాస్సేపు పంజేస్తాడు విధిలేక. ఆడవాళ్ళ ప్రసక్తి వున్న టెలిగ్రాం తగిలితే అదోలాగైపోతాడు. శూన్యంలోకి గుచ్చుకుపోతాయని దృక్కులు.

బలంగా... వంపులు తిరిగిన దేహచాయతో మిసమిసలాడే అనిత అతని మెడ చుట్టూ చేతులేసి విశాలమైన పచ్చిక బయళ్ళలోకి తీసుకెళ్తుంది. ఇద్దరూ చెట్టాపట్టాలేసుకు పరుగెడుతూ వెన్నెల సోయగాల్లో తడుస్తూ ప్రకృతి ఒడిలో తాదాత్మ్యం చెందుతారు. ఆ దశలోనే భుజం తట్టి పిలుస్తాడు టెలిగ్రాఫ్ మాస్టర్. దండయాత్రలో కొంతభాగం కోల్పోయిన కోటలాగైన మనసుతో పంజేస్తుంటాడు - పెదాలు చప్పరించి.

పది సంవత్సరాల క్రితమదే ఆఫీసులో కొత్తగా ఉద్యోగంలో చేరిన అనితతో ఏర్పడ్డ పరిచయం చిగురుదొడిగి ప్రణయంగా మారుతుందని, నా అనేవారు కరువైన తన నలరించి ఆక్రమిస్తుందని, ప్రేమ మాధుర్యాన్ని మనసారా తాగిస్తుందని ఎన్నడూ ఊహించలేదు. ప్రణయం పరిణయం ముంగిట్లోకి చేరుతున్న దశలో ప్రళయం ఎదురైందో రోజు ఆఫీసు ముందు. తనను చూచిన అనిత గబగబా రోడ్డు దాటుతూ సిటీ బస్సును గుద్దుకోవడం. భూనభోంతరాళాలు దద్దరిల్లేలా కేకలెయ్యడం... రోడ్డంతా రక్తసిక్తమవడం... ఆ దృశ్యం ఇప్పటికీ సినిమారీళ్ళలా కళ్ళముందు తిరుగుతూంది. అప్పట్నుంచే డెత్ మెసేజంటే ఇదైపోతాడు.

కలల్లో తేలించి కవ్వించి నవ్వించిన అనిత కెవ్వరూ సాటిరారు. కన్పించిన ప్రతి యువతినీ అనితతో పోల్చి నిరాశకు గురయ్యాయతని కళ్ళు. అందుకే ఆడవారిని సాధ్యమైనంతవరకూ చూడకుండా ఉండాలనుకొంటాడు. ఆ ప్రయత్నంలో భాగమే నైట్ డ్యూటీ.

ఐతే... అనుకోకుండా మురారికో జటిల సమస్య ఎదురైంది.

ఢిల్లీ సర్క్యూట్‌లో పని చేస్తుంటే ఒక ముఖ్యమైన టెలిగ్రాం వచ్చింది. అది విశాఖపట్నం సెంట్రల్ జైలు సూపరెన్టెంటు కందాలి. ఎక్కడి హైదరాబాదూ, ఎక్కడి విశాఖపట్నం! తెల్లవారి ఆరు గంటలకు ఉరితీయబోయే ఆడఖైదీ ఉరిశిక్షను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు జారీ చేసిన టెలిగ్రాఫిక్ ఆర్డర్స్. అరనిమిషంలో మెసేజ్ గమ్ చేసి విశాఖపట్నం టెలిప్రింటర్ ముందు కెళ్ళాడు. మిగతా అరనిమిషంలో.

"...విశాఖపట్నం టిపిలైన్, మోర్స్‌లైను రెండూ చెడిపోయాయి మురారీ" అన్నాడు టెస్టింగ్ టెలిగ్రాఫ్ మాస్టారు భుజం తట్టి. ఎవరో నెత్తిమీంచి పొడవాటి ఇనుపరాడ్‌ని గుండెలదాకా దిగ్గొట్టినట్లయింది.

"మరెలా సార్! ఇప్పుడప్పుడే పన్నెండయింది. ఈ టెలిగ్రామ్ అందకపోతే మరో ఆరుగంటల్లో ఓ ఆడకూతురు ప్రాణాలెగిరి పోతాయ్" అంటూ చూపించాడా మెసేజ్.

"ఫోన్లోనైనా పంపిద్దామంటే విశాఖపట్నం సిటీనే ఫోను చెడిపోయిం దంటున్నాడు. ఇంక మనం చేసేదేముంది చెప్పు! అంతా భగవదేచ్ఛ. ఐనా పన్నెండుకి నీ డ్యూటీ అయిపోయింది. నా డ్యూటీ అయిపోయింది. పద వెళ్దాం. నిద్రొస్తూంది. ఆవులిస్తూ డార్మెంటరీ గదివైపు నడిచాడతడు. మురారికి వెళ్ళాలనిపించలేదు.

గుండెలో గూడు కట్టుకుని ఊపిరిలో ఊపిరైన అనిత మెదడు పొరల్లో కదలాడింది.

"ఈ ఆడకూతుర్నయినా రక్షించి నా ఆత్మకు తృప్తి కల్గించవూ?" ప్రాధేయపడింది.

మనసంతా మెలికలు తిరిగిపోతూంది. ఆలోచనలు అంగలేస్తున్నాయి. నరాలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

"పోనీ... విశాఖపట్నం సెంట్రల్ జైలుకు ట్రంకాల్ బుక్ చేసి సూపరెన్టెంటుకే మెసేజ్ చెప్పేస్తే..."

"అదెలా! విశాఖపట్నం టెలిగ్రాఫ్ ఆఫీసు ద్వారానే వెళ్ళాలి టెలిగ్రాం!... రూల్సు ఒప్పుకోవు..ప్చ్!"

"డైరెక్ట్‌గా చెప్పేస్తే ఉద్యోగమూడి పోతుందీసారి. పదినిమిషాల గుంజాటన స్థిర నిర్ణయ మేర్పరచింది.

ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సెంట్రల్ జైలు విశాఖపట్నంకు అర్జెంట్ ట్రంకాల్ బుక్ చేసి సూపరెన్టెంటుకు చెప్పేశాడా మెసేజ్. ఆ తర్వాతే డ్యూటీ దిగబుద్ధయింది.

"మురారిదో పిచ్చి మాలోకం" అనుకున్నారంతా.

పర్యవసానం పదిహేను రోజుల్లో కనబడింది.

ఉద్యోగానికి తెగించి ఒక నిండు ప్రాణాన్ని మృత్యు మొహంలోంచి

తప్పించడంలో సాహసించిన మురారిని ప్రభుత్వం సన్మానించబోతుందనే సమాచారం వచ్చింది అధికారికంగా.

అతడీసారీ స్ట్రాంగ్ చార్జిషీటు అందుకుని ఉద్యోగమూడ గొట్టుకోవడం ఖాయమనుకున్న స్టాఫంతా ముక్కులకు వేళ్ళుంటించుకున్నారు.

కోవర్కర్స్ ప్రశంసల వర్షం కురిపిస్తుంటే మురారి మనోనేత్రాల్లో అనిత కదలాడింది. ఆమె ముఖంలో తృప్తి వెయ్యి రేకుల గులాబీలా విచ్చుకుంది.

మబ్బులు చూచిన మయూరమైందతని మనస్సు. మల్లెపూల రథమ్మీద ఊరేగుతున్నట్టనిపించింది.

(ఆదివారం ఆంధ్రభూమి 13-1-91)